క్లుప్తంగా

పామర్తి కుటుంబానికి ఉప్పాల పరామర్శ



బంటుమిల్లి: మండలంలోని పెదతుమ్మిడి గ్రామానికి చెందిన పామర్తి సీతయ్య రెండు రోజుల క్రితం మరణించారు. ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆదివారం పరామర్శించారు. సీతయ్య నివాసానికి చేరుకున్న రాము వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ శ్రేణులు, అభిమానులు ఉన్నారు.

కొనసాగుతున్న క్రీస్తు ఆరాధనలు



కృత్తివెన్ను: మండల పరిధిలోని పడతడిక సీఎస్ఐ చర్చిలో క్రీస్తు ఆరాధనలు కొనసాగుతున్నాయి. ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ నుంచి జనవరి ఒకటో తేదీ వరకు ఈ ఆరాధనలు కొనసాగుతాయని స్థానిక సీఎస్ఐ గురువు జాన్సన్ తెలిపారు. ఈ ప్రార్థనలో పలువురు పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు జరిపినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో దైవకుమార్, సంపత్, ప్రకాష్, స్థానిక సర్పంచ్ ప్రదీప్, కౌన్సిల్ సభ్యులు దేవానందం, విశ్వాసులు పాల్గొన్నారు.

కృష్ణా తీరాన అభిషేకాలు



నాగాయలంక: మాసశివరాత్రి విశిష్టత పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో శివలింగానికి ఆదివారం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో మండలంలో పలు గ్రామాల నుంచి వచ్చిన సామాన్య భక్తులతో కలిసి వేకువ జామున విభూధి, నారికేళ, గోక్షీరం, తేనె, పంచదార, పసుపు, కుంకుమ తదితర ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని పూలు, పండ్లతో సుందరంగా అలంకరించారు. శివయ్యకు నందీశ్వరునికి శాస్త్రోక్తంగా పూజలు జరిపి భక్తులకు మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు



కోడూరు: మండలంలోని ఉల్లిపాలెంలో శ్రీమన్నారాయణ స్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో తిరుప్పావై పాశుర పఠనాన్ని భక్తిప్రపత్తులతో జరుపుతున్నారు. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. అమ్మవారికి అభిషేకాలు జరిపి ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. కోడూరులోని శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారికి వివిధ రకాల హారతులిచ్చారు. పల్లకిలో అమ్మవారిని ఆలయం చుట్టూ ఊరేగించారు. కమిటీల సభ్యులు పర్యవేక్షించారు.

ముగిసిన అయ్యప్ప పడిపూజోత్సవాలు



కోడూరు: దివి శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్పస్వామి ఆలయంలో జరుగుతున్న 20వ మండలి పడిపూజోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి అభిషేకాలు, పుష్పాభిషేకాన్ని కనులపండువగా జరిపారు. అనంతరం స్వామివారికి వసంతోత్సవాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. అయ్యప్పదీక్ష స్వీకరించిన దీక్షాపరులకు ఆలయ ప్రాంగణంలో సద్ది ఏర్పాటు చేశారు. ప్రధానార్చకుడు కోమ్మూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేట నిషేధ భృతి ఏదీ?

- ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపలవేట నిషేధం
- నిషేధ సమయంలో జీవనభృతి ఇవ్వాల్సిన ప్రభుత్వం
- నెలలు గడుస్తున్నా గంగపుత్రులకు అందని భృతి
- జగనన్న ప్రభుత్వంలో మే నెలలోనే అందించిన వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



వేట నిషేధ సమయంలో దరికి చేరుతున్న మత్స్యకారులు (ఫైల్) :



వలలను ఒడ్డుకు చేర్చుకుంటున్న మత్స్యకారులు (ఫైల్)

కృత్తివెన్ను: చేపలవేట మత్స్యకారుల జీవనాధారం. కడలి కెరటాలతో పోటీ పడుతూ ఎండనకా వాననకా రేయింబవళ్లు కష్టపడుతూ కుటుంబాలను పోషించుకుంటారు. ఏడాదిలో రెండు నెలలపాటు ప్రభుత్వం వేటనిషేధం విధిస్తుంది. ఈ రెండు నెలలకు ప్రభుత్వం మత్స్యకారులకు జీవనభృతి ఇస్తుంది. అయితే కూటమి ప్రభుత్వం ఇంతవరకు భృతిని ఇవ్వకపోటంపై ఆయా కుటుంబాల్లో ఆవేదన వ్యక్తం అవుతోంది.

సమస్య ఇదీ..

పెడన నియోజకవర్గంలో చేపలవేటపై ఆధారపడి జీవించే 1488 మంది మత్స్యకారులను గుర్తించారు. ఒక్కొక్కరికీ రూ.10 వేల వంతున మొత్తానికి సుమారు రూ.1.5 కోట్ల మేర వేట నిషేధ భృతి అందాల్సి ఉంది. ఈ భృతి చెల్లింపులో ప్రభుత్వం మీన మేషాలు లెక్కించడాన్ని వారు తీవ్రంగా తప్పుపడుతున్నారు.

విషయం ఇదీ..

చేపల సంతానోత్పత్తి సమయంగా పరిగణించి ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14 వరకు రెండు నెలల పాటు సముద్రంలో చేపల వేటను పూర్తిగా నిషేధిస్తారు. ఆ సమయంలో కేవలం నాటు పడవల్లో కొనసాగే సంప్రదాయ వేటకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ నిషేధ సమయంలో మత్స్యశాఖ గుర్తించిన బోట్లలోనే వేటసాగించేవారికి 'వేటనిషేధభృతి'ని ప్రభుత్వం అందించాల్సి ఉంది.

ఎదురుచూపులు..

పెడన నియోజకవర్గంలోని కృత్తివెన్ను మండలంలోనే రిజిస్ట్రేషన్ కలిగిన బోట్లు ఉన్నాయి. మొత్తం 257 బోట్లలో 1488 మంది వేట నిషేధ భృతి కోసం ఎదురుచూస్తున్నారు. చినగొల్లపాలెంలో 96 బోట్లు, ఏటిపవర్‌లో 49 బోట్లు, ఒర్లగొందితిప్పలో 112 బోట్లు ఉండగా వీటిలో 18 సాధారణబోట్లు, 239 మోటారైజ్డ్ బోట్లు ఉన్నాయి. సాధారణ బోటులో ముగ్గురు కళాసీలు, మోటారైజ్డ్ బోటులో 6 కళాసీలు ఉంటారు. వీరందరికీ ప్రభుత్వం నుంచి నిషేధభృతి రూపంలో రూ.దాదాపు రూ.1.5 కోట్లు రావాల్సి ఉంది.

ఆరు నెలలైనా..

కానీ నిషేధ సమయం ముగిసి ఆరునెలలకు పైనే కావస్తోంది. అయినా కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఇవ్వాల్సిన భృతిని నేటికీ ఇవ్వలేదు. దీంతో మత్స్యకార కుటుంబాలవారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భృతి ఎప్పుడు అందుతుందో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

జగనన్న ప్రభుత్వంలో ముందుగానే..

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చేపలవేట నిషేధ భృతిని గత ఐదేళ్లలో మే నెలలోనే అందించేవారు. దీంతో వారు నిషేధ సమయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా తమ జీవనం సాగించేవారు. గత మే నెలలో మాత్రం ఎన్నికల కారణంగా ఇవ్వలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వం భృతి ఊసెత్తడం లేదు.



చాలా బాధగా ఉంది..

రెక్కల కష్టం నమ్ముకున్న వాళ్లం వేట నిషేధ సమయంలో జీవనోపాధి లేక కుటుంబ పోషణ కోసం ప్రభుత్వం మాకు భృతి ఇవ్వాలి. ఆరు నెలలపైనే కావస్తున్నా నేటికి నిషేధభృతి ఇవ్వకపోవడం చాలా బాధగా ఉంది. వెంటనే ప్రభుత్వం మాకు రావాల్సిన భృతిని అందించాలి.

– కొప్పాడ కృష్ణ, కళాసీ, ఏటిమొండి పల్లెపాలెం



పది కాదు ఇరవై అన్నారు

గత జగనన్న ప్రభుత్వంలో ప్రతి కళాసీకి నిషేధసమయంలో భృతి కింద రూ.10 వేలు ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం భృతి ఇంకా ఇవ్వలేదు. మొన్నటి ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వ నేతలు రూ.20 వేలు ఇస్తామన్నారు. ఎప్పుడూ ఇచ్చే రూ.10 వేలు కూడా ఇవ్వలేదు. వెంటనే ఇవ్వాలి.

– కొక్కిలిగడ్డ బాపూజీ, మత్స్యకార నాయకులు

ప్రతిపాదనలు పంపించాం..

పెడన నియోజకవర్గంలోని అర్హులైన కళాసీలందరికీ వేట నిషేధ భృతి కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నుంచి సమాచారం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన భృతి రాగానే వారి ఖాతాలకు జమ చేస్తాం.

– నాగబాబు, ఫిషరీస్ ఏడీ

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



కోసూరువారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కోసూరువారిపాలెం శివారు గొల్లపాలెంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన దేవనబోయిన కోటేశ్వరరావు, వీరరాఘవులకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. మోపిదేవికి చెందిన విశ్వంశెట్టి రామకృష్ణారావు, గజలక్ష్మిల జ్ఞాపకార్థం కుమారుడు ఆర్యవైశ్య సంఘం ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్, మారుతీ యూనియన్ వ్యవస్థాపకుడు విశ్వంశెట్టి మొగల్లేశ్వరగుప్తా ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు, బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.1000 నగదును అందజేశారు. విశ్వంశెట్టి రాజాబాబు, కొలుసు ధర్మారావు, ఓలేటి మాధురి, నీలం సరస్వతి, బాలసాని నాంచారయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖుడికి నివాళి

నాగాయలంక: దివిసీమలో నాటి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నాగాయలంక ఆర్యవైశ్య సంఘాల పెద్ద, సీనియర్ ఎరువుల వ్యాపారి చిట్టా వెంకట పూర్ణచంద్రరావు(పూర్ణ) సంస్మరణ సభ ఆదివారం జరిగింది. పిరమిడ్ మాస్టర్ చిట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సంస్మరణ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘాల సామాజిక సేవలలో పూర్ణచంద్రరావు ఆద్యుడని, ఆయన తన భార్య సంపూర్ణమ్మ పేరుతో నిర్మించిన అపరకర్మల భవనం ఎందరికో సేవలు అందిస్తుందన్నారు. ఆయన సేవలను కొనియాడి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘాల అధ్యక్షుడు చిట్టా సాంబశివరావు, డీసీ అధ్యక్షుడు బండ్రెడ్డి చినబాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు భోగాది నరసింహారావు, మెండు లక్ష్మణరావు (చంటి), డాక్టర్ ఏవీఎల్ నారాయణ, సింహాద్రి కృష్ణప్రసాద్, లకనం నాగాంజనేయులు, కూరపాటి సత్యనారాయణ, భీమా బాబూరావు, చిట్టా అన్నపూర్ణయ్య తదితరులు ప్రసంగించారు.

13న ఎడ్ల పూటీ లాగుడు బలప్రదర్శన పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఘంటసాల: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఘంటసాలలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పూటీ లాగుడు బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండి పరాత్పరరావు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్ తెలిపారు. ఘంటసాలలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల నాటుబండి పోలు రాధా, పూటీ లాగుడు బలప్రదర్శన పోటీల కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని 'మన ఊరు- మన సంక్రాంతి' సంబరాల్లో భాగంగా డాక్టర్ గొర్రెపాటి నవనీతకృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 సోమవారం ఉదయం 10 గంటలకు న్యూ జూనియర్స్ ఎడ్లకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. 14 మంగళవారం ఉదయం 9 గంటలకు ఒంగోలు జాతి ఆవుల అందాల ప్రదర్శన, ఉదయం 10 గంటలకు జూనియర్స్ అండ్ సీనియర్స్ విభాగంలో ఎడ్ల పూటీ లాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా సూరపనేని రాధాకృష్ణ ప్రసాద్ వ్యవహరిస్తారు.వివరాలకువేమూరి రాజేంద్ర ప్రసాద్, బండి పరాత్పరరావు, కన్నెగంటి లక్ష్మీ నారాయణలతో పాటు ఫోన్ 99124 30945, 89191 55334, 99493 19062 నంబర్లను సంప్రదించాలన్నారు. కాకుమాని రంగారావు, వేమూరి రమేష్, అయినపూడి కోటయ్య, దోనేపూడి కిషోర్, గొర్రెపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాలు

గూడూరు: మండలంలోని తరకటూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కోడూరు మండలం విశ్వనాథపల్లి శివారు కుమ్మరిపాలెంకు చెందిన మాదర్ల సాంబయ్య (58) బంధువులు చనిపోతే పరామర్శించడానికి నిడుమోలు వచ్చి తిరిగి తరకటూరు మీదుగా కుమ్మరిపాలెం గ్రామానికి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో విజయవాడ నుంచి బైకు మీద వాలిశెట్టి వెంకటేష్ (36) మచిలీపట్నం వస్తున్నాడు. విజయవాడ- మచిలీపట్నం జాతీయరహదారిపై వస్తుండగా తరకటూరు దగ్గర రోడ్డు డివైడర్ కటింగ్ ప్రాంతంలో వెంకటేష్ సాంబయ్య వాహనాన్ని వెనక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వీరిని బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



1989- 90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

పెడన: వారంతా పెడన భట్టా జ్ఞాన కోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989- 90 ఏడాదిలో పదో తరగతి చదివారు. 34 సంవత్సరాల తరువాత వారంతా తిరిగి పెడనలోని అదే పాఠశాలలో ఆదివారం ఆత్మీయ పండుగను నిర్వహించుకున్నారు. ఒకరికొకరు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందభరితులయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆనాటి ఉపాధ్యాయులు, నేటి విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలను, 1989- 90 జ్ఞాపికలను అందజేసి ఆశీస్సులను అందుకున్నారు. తొలుత వీరంతా కలిసి పలు పోటీలు పెట్టుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రం నుంచే కాకుండా, విదేశాలలో ఉన్న పూర్వవిద్యార్థుల సహాయ సహకారాలను తీసుకుని ఆత్మీయ పండుగను ఘనంగా నిర్వహించడం పట్ల అంతా ఆనందాన్ని వ్యక్తం చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు బొమ్ము గోవర్ధన్‌రావు, పేరిశెట్టి తేజోవతి, మంజు సుభాషిణి, భానుమతి, రవీంద్ర, బాజీ, గ్లోరీ, బషీర్ అహ్మద్, రవీంద్ర, కృష్ణారావు తదితరులు సత్కారాలను అందుకున్నారు. పూర్వ విద్యార్థులకు ఆశీర్వచనాలు అందజేశారు.

సినీ ఫక్కీలో ఘరానా మోసం

గుడ్లవల్లేరు: ఓ దుకాణ యజమాని నుంచి దౌర్జన్యంగా రూ.10వేలను చోరీ చేసి పరారైన సంఘటన కూరాడలో శనివారం చోటు చేసుకుంది. భవానీ మాలధారుల వేషధారణలో నలుగురు గుర్తు తెలియని యువకులుఒక బడ్డీ కొట్టుకు వచ్చారు. దీక్షలో ఉన్న తమ మాలధారులకు చందా ఇవ్వాలంటూ ఆ యజమానిని కోరారు. తమకు రూ.100 చందా కావాలని డిమాండ్ చేశారు. ఫోనులో మాట్లాడుతున్న యజమాని ఆ మాలధారులను పెద్దగా పట్టించుకోకుండా లైట్ తీసుకున్నాడు. తీరా ఆ మాలధారుల్లో ఒకరికి అమ్మవారు తన మీదకు వచ్చి పూనకం వచ్చినట్లుగా క్రియేట్ చేసి నటించారు. వెంటనే దుకాణ యజమాని తన వద్దనున్న రూ.10 వేల కట్టలో రూ.100ను తీసి మాలధారులకు ఇచ్చేశాడు. ఆ మాలధారుల్లో ఒకరు మిగిలిన ఆ రూ.10వేల కట్టను రెప్పపాటులో దుకాణ యజమాని నుంచి లాక్కొని బైక్‌పై ఉడాయించాడు. మిగిలిన వారు కూడా బైకులపై పారిపోయారు. దుకాణ యజమాని తన స్నేహితులతో కలిసి కైకలూరు వరకు వెంబడించినా ఫలితం దక్కలేదు. కైకలూరు, ముదినేపల్లి, గుడ్లవల్లేరు పోలీసులకు తన గోడును ఆ బాధితుడు చెప్పుకున్నాడు. వీరు ఆకివీడుకు చెందిన బ్యాచ్ అని పోలీసుల నుంచి సమాచారం. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ విషయంపై తమకు సమాచారం లేదని ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు.

నేడు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

మచిలీపట్నంటౌన్:ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు స్థానిక బెల్ కంపెనీ ఆడిటోరియంలో జరుగుతుందన్నారు. సభ్యులు సకాలంలో హాజరుకావాలని వారు కోరారు.

హైందవ శంఖారావం ర్యాలీ

బంటుమిల్లి: జనవరి 5న గన్నవరంలో నిర్వహించనున్న హైందవ శంఖారావం మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం బంటుమిల్లిలో ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బంటుమిల్లి హైందవ సంఘం ఆధ్వర్యంలో బంటుమిల్లి రామాలయం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ వివిధ గ్రామాల మీదుగా చినపాండ్రాక వద్ద ముగిసింది. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నసమారాధన

అవనిగడ్డ: స్థానిక రాజశేఖరస్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం నాలుగు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు సాయి పవన్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, అన్నదాన కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేటితో ముగియనున్న ఈ-కేవైసీ గడువు

ముదినేపల్లి రూరల్: సొసైటీల వివరాలు కంప్యూటరీకరణలో భాగంగా రైతులు ఈ-కేవైసీ చేసుకునేందుకు గడువు సోమవారంతో ముగియనుంది. అన్ని సొసైటీలను కంప్యూటరీకరణ చేసే ప్రక్రియను కొన్ని నెలల కిందటే ప్రారంభించారు. రైతులు తమ వివరాలను ఆన్‌లైన్లో ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. దీనివల్ల పంట రుణాలపై వడ్డీ రాయితీ, ఇతర ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. దీనిపై గ్రామాల్లో సరైన ప్రచారం చేయకపోవడంతో ఎక్కువమంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేకపోయారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తూ సొంత గ్రామాల్లో భూములున్న రైతులు సొసైటీల్లో రుణాలు పొందారు. వీరు కూడా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ-కేవైసీ చేయించుకోవాలని సొసైటీ కార్యదర్శులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పేర్నినాని పరామర్శ



చిన్నాపురంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పేర్ని నాని

కోనేరుసెంటర్: రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మండలంలో అనారోగ్యం కారణంతో ఇటీవల మృతి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యకర్తల కుటుంబాలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ఏ విషయంలోనైనా వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. తొలుత పెదపట్నం గ్రామంలో పర్యటించి రెండు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం కానూరు, తాళ్లపాలెం గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. చిన్నాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తకు సంబంధించిన మరో కుటుంబాన్ని పరామర్శించారు. ఈ పర్యటనలో పేర్ని వెంట కృష్ణా జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు జన్ను రాఘవ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, పార్టీ నాయకులు గాజుల భగవాన్, తిరుమలశెట్టి ప్రసాద్, గడిదేశి బాల జేసు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆనంద్

అవనిగడ్డ: నాటక రంగానికి సూరగం రామచంద్రరావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఐఏఎస్ అధికారి శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక ఆరోవార్డులో కళాకారుడు సూరగం రామచంద్రరావు–పార్వతమ్మ దంపతుల సంస్మరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారి శ్రీధర్‌బాబు, కృష్ణా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఆనంద్ రామచంద్రరావు – పార్వతమ్మ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అంతరించి పోతున్న నాటరంగాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా దివిసీమకు చెందిన ప్రముఖ కళాకారులు పుప్పాల వీరాంజనేయులు, బోలెం రామారావు, పి.నాంచారయ్య, బి.అర్జునరావు, వేముల అంకంబొట్లు, నారాయణరావు, ఆర్.వీ రాచార్యులు, కారాని రామ్‌కుమార్, గాజుల కృష్ణమూర్తి నాయుడు, వేముల సూరిబాబు, బెల్లంకొండ ఏడుకొండలు, చింతలపూడి నాగేశ్వరరావు, రామకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు సూరగం జగన్మోహనరావు, గాయకుడు సూరగం రామకృష్ణ, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులతో ఆలయ క్యూలైన్లన్నీ నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగలిశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

7 నుంచి ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు

అవనిగడ్డ: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారక్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మోదుమూడిలో జనవరి 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ధర్మప్రచారక్ మండల ధర్మాచార్యులు అన్నపరెడ్డి కృష్ణ తెలిపారు. మోదుమూడి రామాలయం వద్ద జరిగే ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారని చెప్పారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Avanigadda Branch, వారి [illegible]

[illegible]

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., VIJAYAWADA.
Ph:9849431432

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సంక్షేమానికి కృషి

మచిలీపట్నం టౌన్: రాష్ట్రంలోని ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆత్మీయ కలయిక ఆదివారం రాత్రి స్థానిక బెల్ ఆడిటోరియంలో సంఘ అధ్యక్షుడు పళ్లెం ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి కొనకళ్ల మాట్లాడుతూ రిటైర్డ్ కార్మికులకు సూపర్‌లగ్జరీ బస్సులో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించేందుకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇతర శాఖలో పనిచేసే ఉద్యోగులు ఎంతో కొంత అవినీతికి పాల్పడే అవకాశాలు ఉన్నాయని, కానీ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌లు ఎలాంటి అవినీతికి తావు లేకుండా పనిచేస్తున్నారన్నారు. ఇలాంటి సేవలు అందించిన ఆర్టీసీ కార్మికులకు కొద్ది మొత్తంలోనే పెన్షన్ రావడం ఇతర శాఖలో పనిచేసే ఉద్యోగులకు పెద్ద మొత్తాల్లో పెన్షన్ సౌకర్యం ఉండటంతో ఆర్టీసీ కార్మికులు ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి రిటైర్డ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర బీసీ సంఘం నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) ఆర్టీసీ డిపో మేనేజర్ టీ పెద్దిరాజు, అసోసియేషన్ కార్యదర్శి బీవీ రావు, ఎన్.ఎం.యూ జిల్లా కార్యదర్శి కేవీ రావు, వైద్యుడు కేవీ ప్రసాద్ ప్రసంగించారు. సీనియర్ రిటైర్డ్ కార్మికులు ముగ్గురిని చైర్మన్ కొనకళ్ల నారాయణరావు సత్కరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com